క్లుప్తంగా

బసవేశ్వర జయంతి కార్యక్రమం

మాగనూర్: విశ్వగురు మహాత్మా బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా మాగనూర్ మండల కేంద్రంలోని వర్క్యూర్ క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జరుగుతుందని వీరశైవ లింగాయత్ నాయకుడు గురుప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నేరడగం శ్రీపశ్చిమాద్రి విరక్త మఠం పీఠాధిపతులు పంచమ సిద్ధలింగ మహాస్వామి హాజరవుతారని తెలిపారు. వీరశైవ బంధువులు, ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్ కేటాయింపు

నారాయణపేట: నారాయణపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మక్తల్ మున్సిపాలిటీలో నూతన బార్ కోసం దరఖాస్తు చేసుకున్న 15 మందిలో సీరియల్ నంబర్– 9 దరఖాస్తుదారు శివలీలకు డ్రా తగిలింది. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో డ్రా నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్‌ఐలు శిరీష, రమేశ్, గురువయ్య, సిబ్బంది బాలరాజు, ఖాజపాషా, సురేశ్, సంతోష్, కృష్ణవేణి, నరేశ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



మరికల్: నీటి వృథాను అరికడితేనే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని సీడబ్ల్యూబీ టీం యాదయ్య అన్నారు. సెంట్రల్ టీం జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షపు నీటి ఆదా చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొగులప్ప, ఎంపీడీఓ కొండన్న, ఏపీఓ ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ గ్రామ శివారులో వెలిసిన గజ్జలమ్మవ్వ నూతన ఆలయానికి కుర్వ రాజేశ్వరీ, మహేష్ దంపతులు రూ.50 వేలు విరాళం అందజేశారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గ్రామ పెద్దలకు విరాళం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ శిఖర నిర్మాణంలో అమ్మవారి ప్రతిమ మూర్తులతో పాటు నాలుగు వైపుల సింహాల విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చును విరాళంగా ఇస్తామన్నారు. ప్రస్తుతం అడ్వాన్స్‌గా రూ.50వేలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దాతల ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మన్న, శ్రీనివాస్‌రెడ్డి, నాయిని గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం

మద్దూరు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, ఖోఖో క్రీడలపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కోచ్ చెన్నారం వెంకటప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94914 89754, 63014 98878 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్, కృష్ణరాజ్ మంగళవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో అల్లీపూర్‌కు చెందిన గోవర్ధన్‌రెడ్డి రూ.45 వేలు, గోపాల్‌కు రూ.లక్ష, శ్రీనివాస్‌కు రూ.23 వేలు, గోకుల్‌నగర్‌కు చెందిన నర్సిములు రూ. 50వేల చెక్కు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులేవి ?

- పథకంలో పనుల తగ్గింపు
- కొరవడిన ఉపాధి అవకాశాలు
- మండలంలో 12,388 జాబ్ కార్డులు



అన్నసాగర్‌లో ఫారం పాండ్ నిర్మాణం

దామరగిద్ద: వ్యవసాయ కూలీలు, పేద మధ్యతరగతికి చెందిన గ్రామీణ కూలీలకు వ్యవసాయ పనులు లేని సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో హామీల్లో ఎక్కువ.. అమలులో తక్కువ అన్న చందంగా మారింది. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అనుబంధంగా ఆయా ప్రాంతాల్లో అవసరమైన వ్యవసాయ భూమి లెవలింగ్, పెబ్బల్ బండింగ్, స్టోన్ బండింగ్, చెరువుల పూడిక తీత, వాలు కట్టలు, ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ కూలీలకు ఉపాధి కల్పించాలి. కాగా ప్రస్తుతం గతంలో ఉన్న పనులు తగ్గించడంతో పనుల కోసం దరఖాస్తులు తగ్గి, తద్వారా కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గడంతో కూలీల సంఖ్య భారీగా తగ్గింది.

12,388 జాబ్ కార్డులు..

మండలంలో మొత్తం 12,388 కుటుంబాలు జాబ్ కార్డులు కల్గి ఉన్నాయి. వీరిలో ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న యాక్టివ్ జాబ్ కార్డులు కలిగినవారు 8000 మందికి పైగా ఉన్నారు. ప్రస్తుతం మండలంలో 42 పనులు కొనసాగుతుండగా రోజుకు 1800 నుంచి 2వేల మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారు.

నిధులు కేటాయించని పనులు

ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో ఎక్కువ మంది కూలీలకు ఉపాధి అవకాశం కల్పించే చెరువు మట్టి పూడిక తీత పనులకు పథకంలో నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో పాటు గులకరాళ్ల ఏరివేత, ఫీడర్ ఛానల్, పంట పొలాలకు చెరువు కాల్వల పూడిక తీయడం, వంటి పనులకు నిధులు కేటాయించక పోవడంతో ఆయా పనులు కల్పించడం లేదు. కేవలం వ్యవసాయ పొలాలకు (ఆర్‌సీపీ) రోడ్లు, ఫారం పాండ్స్, ఎర్త్ బండింగ్,



ముస్తాపేటలో ఆర్‌సీ రోడ్డు నిర్మాణంతో కూలీలు

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాల్లో పండ్ల మొక్కలు నాటేందుకు పాదులు తీయడం వంటి పనులకు మాత్రమే మంజూరు చేస్తున్నారు.

సదుపాయాల కరువు

పని ప్రదేశాల్లో కూలీలు ఎండ నుంచి సేద తీరేందుకు టెంట్లు ద్వారా నీడ సదుపాయం కల్పించేవారు. ప్రస్తుతం వేసవి సదుపాయాల బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించడంతో పంచాయతీ అధికారులు నిధులు లేమి పేరుతో పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని కూలీలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పనుల్లో రైతులకు ఉపయోగపడే పనులు కల్పించాలని కోరుతున్నారు. అదే విధంగా పని ప్రదేశం వద్ద కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు



మంజూరులో ఉన్న పనులను సద్వినియోగం చేసుకొని ఉపాధి కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతుల ఆసక్తి మేరకు ఫారం పాండ్స్, పశువుల షెడ్లు, పొలాలకు రోడ్డు సదుపాయం, వాలు కట్టలు, కుంటలు, ఫిష్ పాండ్ వంటి పనులు సాగుతున్నాయి. ఉద్యాన పంటల సాగు చేపట్టే రైతులకు మొక్కలు నాటేందుకు పాదుల తీయడంతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు పథకం ద్వారా అందజేయబడతాయి. ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జయమ్మ, ఏపీఓ దామరగిద్ద

సామాజిక తనిఖీ కార్యక్రమం



డీఆర్డీఓ మొగులప్పకు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

మరికల్: ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ అవరణలో మంగళవారం 4వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శుల సమక్షంలో గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల వారీగా జరిగిన ఉపాధి హామీ పనుల తీరు, జరిగిన అక్రమాలను ప్రజా వేదికలో అధికారుల ఎదుట ప్రస్తావించారు. సామాజిక బృందం జరిపిన తనిఖీలో ముఖ్యంగా మండలంలోని ఇబ్రహీంపట్నం, మాధవరం, పల్లెగడ్డ, కన్మనూర్‌తో పాటు తదితర గ్రామాల్లో ఒకే కుటుంబంలో తల్లీ కుమారుడికి, భార్యా భర్తలకు విడివిడిగా జాబ్ కార్డులు ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం ఒక కుటుంబలో ఒకే జాబ్‌కార్డు ఉండలని వారు నివేదించారు. ఒకే ఇంట్లో రెండు జాబ్ కార్డులు ఉండటం వల్ల అదనంగా ఒక్కొక్క ఇంటికి రూ. 24 వేలు కూలీ డబ్బులు వెళ్లాయని వివరించారు. దీంతో పాటు పలు గ్రామాల్లో ప్రైవేట్ ఉద్యోగులు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఉపాధి పనులు చేయకున్న వారి బ్యాంకు ఖాతాలో ఉపాధి కూలీ డబ్బులు జమ చేసి తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సంక్రమంగా కూలీల మాస్టర్లు, రికార్డులు రాయకపోవడం, వేసవిలో మొక్కలకు నీళ్ల పోయకున్న పోసినట్లు డబ్బులు తీసుకోవడం వంటి అక్రమాలు జరిగినట్లు తేల్చారు. అనంతరం పలు గ్రామాల్లో ఫీడర్ చానల్ ఏర్పాటు చేసిన విషయంలో అవకతవకలు జరిగాయని సామాజిక బృందం సభ్యులు వెలుగులోకి తీసుకరావడంతో మండల ఫీల్డ్ అసిస్టెంట్లు డీఆర్‌డీఓ మొగులప్ప ఎదుట నివేదికను తప్పు పడుతూ ఆందోళనకు దిగారు. అనంతరం డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. ఒకే ఇంట్లో రెండు జాబ్ కార్డులు ఉంటే అందులో ఒకటి తొలగించాలన్నారు. అలాగే పనులు చేయకున్నా డబ్బులు తీసుకున్న వారి నుంచి ఇందుకు కారణమైన ఫీల్డ్ అసిస్టెంట్, కార్యదర్శులు బాధ్యత వహించి రికవరీ చేయించాలన్నారు. కొన్ని రోజులుగా ఉపాధి పనుల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నా రూ.1.10 కోట్ల పనులకు కేవలం రూ. 63,180 అక్రమాలు జరిగినట్లు అధికారులు తేల్చడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఓ జ్యోతిలక్ష్మి, ఎంపీడీఓ కొండన్న, ఎంపీఓ పావని, ఎస్ఆర్‌పీ రాఘవులు, ఏపీఓ ఊశన్న, ఏఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్య పరిరక్షణ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దామరగిద్ద: జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేస్తాయని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్, ఎన్నికల వర్క్‌షాప్ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో ఒకే దేశం– ఒకే ఎన్నిక విధానంపై బీజేపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వలన ఖర్చు, ఫలితాలు, మరో ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉండదన్నారు. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం తగ్గి ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు గోపాల్‌రావ్, మాజీ ఎంపీటీసీ అంజిలప్ప, సత్యనారాయణ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా షీ టీం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో మహిళలకు అండగా షీటీం ఉందని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండ్‌లో వేచి ఉన్న సమయంలో ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన, మాయ మాటలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చిన డయిల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల డీపీలతో వాట్సప్ కాల్ చేసి డబ్బులు పంపమని అడిగితే స్పందించవద్దన్నారు. గుర్తు తెలియని లింక్‌లను ఓపెన్ చేయకుండా ఉండడం వల్ల సైబర్ నేరాలు అరికట్టవచ్చన్నారు. బస్సుల్లో ప్రయాణం చేసే సమయంలో విలువైన వస్తువులు, డబ్బులు జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నయ్య, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

జీఓ 69 ద్వారా నీరు ఇవ్వాలి

నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జీఓ 69 డీపీఆర్‌లో మార్పులు చేసి కోటకొండ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించాలని సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు కాశీనాథ్ మాట్లాడుతూ.. ఇటీవల నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సర్వే పూర్తి చేసి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జాజాపూర్ చెరువు ద్వారా మేక హనుమాన్ తండా వద్ద అదనపు లెఫ్ట్ ఏర్పాటు చేసి కోటకొండ, తిరుమలాపూర్‌తో పాటు మరో 10 గ్రామాలకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మధుమేహ శిబిరం

నారాయణపేట రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల శ్రీ సాయి ఆసుపత్రి ఆవరణలో బుధవారం ఉచిత మధుమేహ శిబిరం నిర్వహిస్తున్నట్లు ల్యాబ్ శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో స్వర్ణోత్సవ పూజలు



పూజలు చేస్తున్న పండితులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ నరసాచల భూశ్రీనివాసస్వామి ఆలయంలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగవత సప్తాహం, సంగీత కచేరి, ఆధ్యాత్మిక ధార్మిక ప్రసంగాలు కొనసాగాయి. ఈ సందర్భంగా బిద్వాన్ తుప్ప నక్కిరి ప్రహల్లాదచార్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి అన్నారు. రాయచూర్‌కు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు శేషగిరి దాసుల హరిదాస కచేరీ, ఉడిపి విద్వాన్ వంశీకృష్ణాచార్య లక్ష్మీ శోభ ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో గోవింద తీర్థ స్వాములు, శక్తి పీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్, సేవా సమితి సభ్యులు సీతారామారావు, జనార్ధన్‌రావు, ప్రభంజన్‌రావు, భీమ్‌సేన్‌చారి, హన్మేష్, ప్రకాష్ శేషు తదితరులు పాల్గొన్నారు.

భరత నాట్య ప్రదర్శన



మక్తల్: మక్తల్‌కు చెందిన ఆద్య అకాడమీ చెందిన విద్యార్థుల హైదరాబాద్‌లో నిర్వహించిన నృత్య ప్రదర్శన మంగళవారం చూపరులను ఆకట్టుకుంది. కంచి కామకోటి పీఠం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇతిహాసాలకు సంబంధించిన ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో హరతి జ్యోషి, సాయి సపత్తశ్రీ, ధరణి, క్రితి, మనస్విని, హాసినీ, అనూహ్య, ప్రణవి, మాళవిక, రంజిత్‌రెడ్డి, మానస, స్వాతి, అలేఖ్య, భాగ్య, స్వప్న, పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమి కాపాడేందుకు కంచె ఏర్పాటు



మాట్లాడుతున్న నాయకులు

మరికల్: గ్రామ కంఠభూమి కాపాడేందుకు కంచె ఏర్పా టు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ జోగు లక్ష్మి, రామస్వామి, మాజీ ఉప సర్పంచ్ శివకుమార్ అన్నారు. గ్రామకంఠం భూమి విషయంపై మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారే కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, తిరుమలయ్య, నర్సిములు, శ్రీనివాస్, కమల్, మాసప్ప తదితరులు పాల్గొన్నారు.

బోర్డు పేరు మార్చాలని వినతి

మక్తల్: మండలంలోని టేకులపల్లి గ్రామ శివారులో నిర్మించిన టోల్‌గేట్‌కు కాచ్‌వార్ బోర్డు పెట్టడం సరి కాదని మంగళవారం గ్రామస్తులు ధర్నా చేశారు. టోల్‌గేట్ టేకులపల్లి శివారుల్లో ఉండటంతో టేకులపల్లి బోర్డు పెట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మే 5న భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ



ఊట్కూరు: భగత్‌సింగ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి సలీం అన్నారు. మంగళవారం బిజ్వార్‌లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మే 5వ తేదీన మక్తల్ పట్టణంలో నిర్వహించనున్న భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య హాజరవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నప్ప, వెంకట్‌రెడ్డి, చిన్నబాలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మక్తల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సాయిగంగా వాటర్ ప్లాంట్ యాజమాని రాకేష్ సౌజన్యంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన హిందీ పండిత్ అశోక్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడే వాల్‌పోస్టర్ విడుదల



దామరగిద్ద: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 139వ మే డే వాల్‌పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలోని సంజీవరాయ ఆలయ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలోని 47 కోట్ల మంది శ్రమజీవులున్నారని వీరిలో కేవలం 7 కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘీకభద్రత, కనీస వేతనం అందుతున్నాయన్నారు. మిగిలిన 40 కోట్ల మంది కార్మికులు ఉద్యోగ భద్రత లేక సతమతమౌతున్నారన్నారు. కార్మిక చట్టాల పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మే డే కార్యక్రమాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాయప్ప మధు, మహాదేవ్, ఎల్లప్ప, అనిల్, నర్సింహులు, తరుణ్, భీమేష్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి వేడుకల్లో భాగంగా మంగళవారం జలాధివాసం, ధాన్యాధివాసం కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం గ్రామంలోని 9 చోట్ల బొడ్రాయి ప్రతిష్ఠాపనన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్, కాళన్న, లచ్చప్ప, నవీన్, సత్యప్ప, మల్లేష్, సిద్ధూ, రాజు, సురేందర్, కృష్ణయ్య, మహేష్, రాజు, రవి పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు



దామరగిద్ద: మండలంలోని విఠలపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని మొగులమ్మ మృతిపై 2007–08 బ్యాచ్ పదో తరగతి తోటి విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు కిష్టప్ప హన్మమ్మలకు రూ.35 వేల ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం మోహన్‌రెడ్డి, భరత్‌కుమార్, నారాయణ, నర్సింహాచారి, రాధిక, సంధ్యారాణి, అనురాధ, మల్లేశ్వరి రాజు, మోహన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, భీం తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. వ్యక్తికి గాయాలు



గాయపడిన డేవిడ్

మాగనూర్: మండల కేంద్రలోని కొత్తపల్లి క్రాస్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయాలపాలైన ఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మాగనూర్ మండలం నేరడగం గ్రామానికి చెందిన డేవిడ్ కూమారుడితో కలిసి మండల కేంద్రం నుంచి నేరడగానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం బొంగ్రల్‌దొడ్డికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంపై మక్తల్‌కు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో డేవిడ్ తీవ్రంగా గాయపడగా మిగిలిన వారం స్వల్పంగా గాయపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లో డేవిడ్‌ను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్షేత్రస్థాయి పరిశీలన



ధన్వాడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మంగళవారం మండల కేంద్రంలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మొత్తం 150 మంది లబ్ధిదారుల పేర్లను ఇందిరమ్మ కమిటీ అందజేయగా అందులో అర్హులను గ్రామ ప్రత్యేక అధికారి, మండల పంచాయతీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థలాలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హజ్రత్ షావలి గంధోత్సవం



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో బుధవారం హజ్రత్ జిందా షావలి గంధోత్సవం నిర్వహించనున్నట్లు మంగళవారం నిర్వాహకులు తెలిపారు. జల్లి బిందే కార్యక్రమం మాజీ సర్పంచ్ నాగిరెడ్డి ఇంటి నుంచి పురవీధుల గుండా బయలుదేరి దర్గా వద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు. గురువారం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

పౌరాణిక కళాకారులను ఆదుకోవాలి

చిన్నంబావి: రాష్ట్రంలోని పౌరాణిక రంగస్థల కళాకారులను ఆదుకోవాలని పౌరాణిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌరాణిక కళాకారుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పద్మగౌడ్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, వెంకటయ్య, కృష్ణారెడ్డి, కాంతారెడ్డి, పూజారి బాలస్వామి పాల్గొన్నారు.

సగరులకు ప్రాధాన్యమివ్వాలి

ధన్వాడ: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సగరులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాల ని నారాయణపేట జిల్లా సగర సంఘ అధ్యక్షుడు వేముల ఆంజనేయులు, జిల్లా నాయకులు ఎడివెల్లి శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ నామినేటేడ్ పదవుల్లో తమ కులానికి అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథక లబ్ధి దారులు ఎంపికలో సామాజిక వర్గానికి న్యాయం చేయాలన్నారు. సగర కులాన్ని బీసీ–డీ గ్రూప్ నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చాలని, ఎమ్మెల్యేలు చట్టసభల్లో ఈ విషయమై ప్రస్తావించాలని కోరారు.